తుఫాన్ వస్తే అంతే !

- మండలానికి ఒక్కటే తుఫాన్ షెల్టర్
- 9 షెల్టర్లకుగాను ఉన్నది ఒక్కటే
- ముప్పు వస్తే పునరావాస కేంద్రాలుగా కళాశాలలు, హైస్కూళ్లు
- ఉదాసీనతగా కూటమి ప్రభుత్వం, పట్టించుకోని అధికారులు



మండలానికి దిక్కుగా మారిన వాడరేవులోని ఏకైక తుఫాన్ షెల్టర్



పల్లిపాలెం పంచాయతీ పెద్దపల్లిపాలెం గ్రామంలో కూల్చివేసిన తుఫాన్ షెల్టర్ ప్రాంతం

చీరాల టౌన్: రబీ సీజన్‌లో తుఫాన్‌లు తరచూ తీరాలను తాకుతుంటాయి. మనకు సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు తుఫాన్‌లు దాడులు చేస్తుంటాయి. అందుకోసం తీర ప్రాంత గ్రామాలను సురక్షితంగా ఒక్క చోట చేరుందుకు తుఫాన్ షెల్టర్లు ఆదుకుంటుంటాయి. తుఫాను పేరు వింటేనే తీర ప్రాంత గ్రామాల ప్రజల వెన్నులో వణుకు పుడుతుంది. ఏడాదికి పది వరకు తుపాన్లు, వాయుగుండాలు ఏర్పడటంతో తీరప్రాంతాల్లోని ప్రజలు పడే బాధలు అన్నీఇన్నీ కావు. భారీవర్షాలు, తుపాన్లు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు లోతట్టు, బాధిత ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలలో ఉంచేందుకు ఏర్పాటు చేసిన తుఫాన్ షెల్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరిపోయాయి. మండలానికి ఒకే తుఫాన్ షెల్టర్ వినియోగంలో ఉందంటే అధికారుల పనితీరు, ప్రభుత్వం నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థంచేసుకోవచ్చు. జిల్లాలోనే పేరుగాంచిన సముద్ర తీర, పర్యాటక ప్రాంతం వాడరేవు, రామాపురం తీర ప్రాంత గ్రామాలు. ఈ గ్రామాల్లో మత్స్యకారులు పదివేలకు పైగా ప్రజలు జీవనం సాగిస్తుంటారు. తీరప్రాంత గ్రామాలతో పాటుగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చి వారికి ఆశ్రయం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన తుఫాన్ షెల్టర్లు మండలంలో కనుమరుగయ్యాయి. 15 గ్రామాల్లో 9 తుఫాన్ షెల్టర్లకుగాను కేవలం ఒక్కటి వాడరేవులో ఉన్న షెల్టర్ మాత్రమే వినియోగించడానికి అనువుగా ఉంది. మిగిలిన వాటిని శిథిలావస్థకు చేరడంతో అధికారులు కూల్చివేశారే కాని నూతన భవనాల నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు చెప్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే..

తుఫానులు, గాలివానలు, వరదలు సంభవించినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆయా బాధిత ప్రాంతాల ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు మండలంలో తొమ్మిది తుఫాను షెల్టర్లను గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే గత కొంత కాలంగా ఈ తుఫాన్ షెల్టర్లను వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకోవడంతో పలు గ్రామాల్లోని తుఫాన్ షెల్టర్లను కూల్చివేశారు. గతంలో వరుసగా సంభవించిన లైలా, ఓగ్ని, జల్, థానే వంటి తుఫాన్ల సమయంలో కూడా ఈ షెల్టర్లు శిథిలావస్థలో ఉండటం వలన రెవెన్యూ, పంచాయతీశాఖ అధికారులు వీటిని వినియోగించకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో వివిధ కళాశాలలు, పాఠశాలల్లో పునరావాసా కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్నారు. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు భారీ వర్షాలతో పాటుగా తుఫాన్లు, వాయుగుండాలు పడుతుంటాయి. ఈ నాలుగు మాసాల్లోనే తుఫాన్ల తీవ్రత అధికంగా ఉంటుంది. వర్షాకాలంతో పాటు, రాష్ట్రంలో రుతుపవనాలు వేగంగా వీస్తూ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు చెప్తున్నారు. భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాలలోని నిర్వాసితులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తుఫాన్ సెంటర్లలో ఆశ్రయం కల్పిస్తారు. అయితే రూరల్ గ్రామాలైన దేవినూతల, పచ్చమొగిలి, విజయలక్ష్మీపురం, దేవాంగపురి, పిట్టువారిపాలెం, కీర్తివారిపాలెం గ్రామ పంచాయతీల్లో ఉన్న తుఫాన్ షెల్టర్లు శిథిలావస్థకు చేరడంతో అధికారులు కూల్చివేశారు. అలానే తోటవారిపాలెం, కావూరివారిపాలెం గ్రామ పంచాయతీల్లో ఉన్న తుఫాన్ షెల్టర్లలో తాత్కాలికంగా రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలుగా వినియోగిస్తున్నారు. కేవలం వాడరేవు గ్రామంలో ప్రపంచ బ్యాంకు నిధులు రూ.1.5 కోట్లతో నిర్మించిన తుఫాన్ షెల్టర్ మాత్రమే వినియోగంలోకి అనువుగా ఉందని అధికారులు తేల్చేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుని ఆశ్రమం కల్పించేందుకు బృహతరమైన లక్ష్యం కాస్తా అటకెక్కింది. తుఫాన్లు వస్తే పలు ప్రైవేటు కళాశాలలు, ప్రభుత్వ హైస్కూళ్లను పునరావాసా కేంద్రాలుగా వినియోగిస్తున్నారు. తుఫాన్ల సమయంలో ఇబ్బందులు లేకుండా షెల్టర్లపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని నూతన నిర్మాణాలు చేపట్టాలని తీరప్రాంత ప్రజలు కోరుతున్నారు.

చినగంజాం మండలంలో పరిస్థితి దారుణం..

మోటుపల్లి, పల్లెపాలెం, పెదగంజాం పంచాయతీలో తుఫాన్ షెల్టర్లు గతంలో ఉండేవి. ప్రస్తుతం పెదగంజాం పంచాయతీ పల్లెపాలెం గ్రామంలో మాత్రమే తుఫాన్ షెల్టర్ ఉంది. మిగిలిన రెండు పంచాయతీల్లో తుఫాన్ సెంటర్లు శిథిలావస్థకు చేరుకోవటంతో అధికారులు కూల్చివేశారు. తుఫాను వంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో అధికారులు మోటుపల్లి పంచాయతీలోని ముంపు ప్రాంతాల ప్రజలను అక్కడి పాఠశాలలోకి, చినగంజాం పల్లిపాలెం పంచాయతీ ముంపు ప్రాంతాల ప్రజలను చినగంజాం జెడ్పీ పాఠశాలలోకి తీసుకొని వచ్చి పునరావాసం కల్పిస్తారు. అయితే ఈ రెండు పంచాయతీల్లోని ముంపు ప్రాంతాల ప్రజలకు సరైన తుఫాన్ షెల్టర్లు లేవు.

> **ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం..**
> మండలంలో ఉన్న 9 షెల్టర్లలో వినియోగానికి అనువుగా లేకపోవడంతో ఉన్నతాధికారులు ఆదేశాలతో గతంలోనే కూల్చివేశారు. అయితే నూతన తుఫాన్ షెల్టర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే నూతన షెల్టర్లు ఏర్పాటు చేయగలం.
> – రామచంద్రుడు, పంచాయతీరాజ్, ఏఈ

క్లుప్తంగా

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు

చీరాల అర్బన్: పట్టణంలోని వైపీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో 2024–25 విద్యాసంవత్సరానికి డిగ్రీ కోర్సులలో బోటనీ, ఎకనామిక్స్ సబ్జెక్టులలో బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.మురళి మంగళవారం తెలిపారు. సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు డెమో క్లాస్, ఇంటర్వ్యూలకు ఈనెల 5న ఉదయం 10 గంటలకు కళాశాలలోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషిచేద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

యద్దనపూడి: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యద్దనపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. మంగళవారం యద్దనపూడి పీహెచ్‌సీ కేంద్రంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సారథ్యంలో హెచ్‌ఐవీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని, చేతులు కలపటం, కలిసి తినటం ద్వారా ఇతరులకు సోకదన్నారు. అసురక్షిత లైంగిక సంబంధాలు ద్వారానే ఇతరులకు సోకే అవకాశం ఉందన్నారు. అనంతరం వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక లింక్‌వర్కర్ నాగమల్లేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం ఆహారం తరలింపు



ఆహార బాక్సులు సిద్ధం చేస్తున్న దృశ్యం

మార్టూరు: తుఫాన్ తీవ్రతకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుల కోసం మార్టూరు నుంచి మంగళవారం పదివేల మందికి సరిపడా ఆహార పొట్లాలను పంపించారు. స్థానిక ఇసుక దర్శి లోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో సిద్ధం చేసిన ఆహార బాక్సులను విజయవాడలోని తుఫాను బాధితుల కోసం పంపించారు.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆటో యూనియన్ ఎన్నిక



చీరాల రూరల్: పట్టణంలోని దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆటో యూనియన్‌ను మంగళవారం ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ నాయకుడు వాసిమళ్ల వాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా మార్పు కుమార్, ఉపాధ్యక్షుడిగా గేరా రాజేష్, సెక్రటరీగా మల్లి ఆనంద్, జాయింట్ సెక్రటరీగా దబ్బుకూటి శ్యాంసన్, ట్రెజరర్‌గా గుంటి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. సభ్యులుగా లింగం శేఖర్, బొనిగల యేసురాజు, దబ్బుకూటి ప్రతాప్, ఆలూరి మనోహర్, మణికంఠ, సీతయ్య, దాసు, ఈశ్వర్, చక్రిలను నియమించినట్లు నూతన అధ్యక్షుడు కుమార్ తెలిపారు. యూనియన్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం గౌరవాధ్యక్షుడు వాసిమళ్ల వాసు ఆధ్వర్యంలో ఒన్‌టౌన్ సీఐను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు.

9న మండల సర్వసభ్య సమావేశం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ఈనెల 9 తేదీన ఉదయం 11 గంటలకు సంతమాగులూరు మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం స్థానిక పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీ. లక్ష్మీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె ప్రకటనలో కోరారు.

ఆశ వర్కర్ల సేవలు అమూల్యమైనవి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

మేదరమెట్ల: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజానికానికి ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందించడంలో ఆశ వర్కర్లు ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారని మేదరమెట్ల ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ చిట్టిబాబు అన్నారు. జాతీయ ఆశ దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ మండలి సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలను అందించడం, సీజనల్ వ్యాధులు సంక్రమించినప్పుడు క్షేత్రస్థాయిలో రోగులకు ఎప్పటికప్పుడు వైద్యసలహాలు, సేవలు చేయడంలో ఆశలు ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వోలు బ్రహ్మానందం, ఎస్కే మహబూబ్ జానీ, పీహెచ్ఎన్ కే.సుధ, పద్మావతి, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సర్దుబాటు కౌన్సెలింగ్



ఉపాధ్యాయులను కౌన్సెలింగ్ చేస్తున్న అధికారులు

జే.పంగులూరు: మండలంలోని ఆరుగురు ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారులు మంగళవారం పంగులూరులోని విద్యావనరుల కేంద్రంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో నూతలపాటి జయమ్మ అనే ఉపాధ్యాయురాలు పంగులూరులోని ప్రాథమిక పాఠశాల నుంచి బూదవాడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)కు బదిలీ అయ్యారు. నూజిల్లపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి గ్రేస్ మనోరమ్మ కశ్యాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. మరో ముగ్గురు ఉపాధ్యాయులు డివిజన్‌కు బదిలీ అయినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారులు కే నాగభూషణం, జి వీరాంజనేయులు నిర్వహించారు.

ఫీవర్ సర్వేపై అప్రమత్తత అవసరం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ షాలినీ

స్వర్ణ(కారంచేడు): వాతావరణంలో ఉన్న మార్పులను బట్టి గ్రామాల్లో విష జ్వరాలు విజృంభించకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలినీ సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్యసిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాలు విపరీతంగా కురుస్తున్నందున లోతట్టు ప్రాంత ప్రజలకు పలు రకాల అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదముందన్నారు. ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో ఫీవర్ సర్వేలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజు మీ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి జ్వర పీడుతులు ఉంటే వారిని గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలను అందించాలన్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే వెంటనే సమీప పీహెచ్‌సీ లేదా ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్‌ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఇటుక ట్రాక్టర్



విద్యుత్ స్తంభానికి ఢీకొని నిలిచిపోయిన ట్రాక్టర్

స్వర్ణ (కారంచేడు): ఇటుకల లోడుతో చీరాల వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. దీంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. ఈ ఘటన మంగళవారం ఉదయం మండలంలోని స్వర్ణ గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. అద్దంకి నుంచి ఇటుకల లోడుతో చీరాలకు వస్తున్న ట్రాక్టర్ కారంచేడు మండలం స్వర్ణ గ్రామం కొమ్మమూరు కాలువ కట్ట ఎక్కే క్రమంలో అదుపు తప్పింది. దీంతో ట్రాక్టర్ వెనుకకు ఒరిగిపోయింది. కాలువ కట్ట మీద ఉన్న విద్యుత్ స్తంభానికి ఆనుకొని ట్రాక్టర్ నిలిచిపోయంది. ట్రాక్టర్ కొమ్మమూరు కాలువలోకి వెళ్లిపోయి ఉంటే ట్రాక్టర్‌పై ఉన్న ముగ్గురు వ్యక్తులకు ప్రాణాపాయం సంభవించేదని చెప్పన్నారు. వెంటనే స్థానికుల సహకారంతో ట్రాక్టర్‌ను నిలుపుదల చేశారు. అనంతరం ట్రాక్టర్‌లోని ఇటుకలను కిందకు దించి ట్రాక్టర్‌ను జాగ్రత్తగా బయటకు తీశారు. దీంతో స్థానికులు, ట్రాక్టర్‌పై ఉన్న వ్యక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

సింగిల్ విండో పద్ధతిలో చవితికి అనుమతులు

మార్టూరు: ప్రజలు వినాయక చవితి అనుమతుల కోసం పోలీసు, విద్యుత్, అగ్నిమాపక, పురపాలక శాఖల కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సింగిల్ విండో పద్ధతిలో ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందవచ్చని మార్టూరు సీఐ ఎం శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ మండపం అనుమతులు అవసరమైన ప్రజలు తమ సెల్‌ఫోన్ ద్వారా 79950 95800 వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే ఎన్ఓసీ కోసం అవసరమైన ప్రక్రియ వారి ఫోన్‌కు వస్తుందని ఆయన తెలిపారు. అనంతరం ganeshutsav.appolice.gov.in వెబ్‌సైట్ ద్వారా గణేష్ మండపం ఏర్పాటు చేయు ప్రదేశం, పోలీస్ స్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ట నిర్వహించు తేదీ, నిమజ్జనం ఏ రోజు ఎక్కడ ఏ వాహనం ద్వారా చేస్తారనే వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆ దరఖాస్తు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారి ఆధ్వర్యంలో అనుమతులు అవసరమైన అన్ని శాఖలకు పంపుతారన్నారు. సంబంధిత అధికారులు మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలించి నిరభ్యంతర పత్రం మంజూరు చేస్తారని ఆయన తెలిపారు. ప్రజలు తమ సమీపంలోని మీసేవ కేంద్రాల ద్వారా తగిన రుసుము చెల్లించి ఎన్‌వోసీ కాపీ తీసుకొని నిమజ్జనం పూర్తి అయ్యేంతవరకు మండపంలో అందుబాటులో ఉంచాలని సీఐ తెలిపారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

మేదరమెట్ల: మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు నివారణకు తగిన చర్యలు చేపట్టాలని ఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు, రావినూతల, కుర్రవానిపాలెం గ్రామాల్లో మొక్కజొన్న పైర్లను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ గడచిన రెండు మూడు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు కనిపిస్తుందన్నారు. తల్లి రెక్కల పురుగు ఆకులపై పెట్టిన గుడ్లు పగిలి లద్దెపురుగులుగా మారి ఆకులపై ఉన్న పత్రహరితాన్ని తినేస్తుందన్నారు. దీంతో ఆకులపై తెల్లటి పొరలు ఏర్పడతాయన్నారు. లద్దె పురుగులు పగటిపూట ఆకుల కిందిభాగాన చేరి రాత్రి సమయాల్లో ఆకులపై దాడి చేస్తాయని తెలిపారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ కత్తెర పురుగును నివారించాలని ఏవో సూచించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, భాద్రపద మాసం, ఉత్తర నక్షత్రం, విదియ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోష కాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు →



రుచి, శుచిగల ఆహారాన్ని అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కాంతారావు

అద్దంకి రూరల్: గిరిజన గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు రుచి, శుచిగల పౌష్టికాహారాన్ని అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కా కాంతారావు అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తరగతి గదులు, వసతి గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో పులిపాటి హేబేలు, వీరయ్య, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మట్టకొయ్య బాబు, మట్టకొయ్య జోషి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ తరువాత సస్యరక్షణ చర్యలు..

- పొలంలో నీరు తీసివేస్తేనే పంటకు రక్ష



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

బల్లికురవ: వాయుగుండ ప్రభావంతో కురిసిన వర్షాలకు రైతులు సాగు చేసిన పంట పొలాల్లో నీరు చేరి ఉందని, ఆ నీరు వెంటనే బయటకు తీసివేసి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో ఎస్వీపీ కుమారి మంగళవారం తెలిపారు. ఆయా పంటల్లో చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు.

వరి..

మండలంలోని కొన్ని గ్రామాల్లో వరి పంట దుబ్బు చేసే దశలో ఉందని, దానికి ఈవానలతో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించే అవకాశం ఉందని చెప్పారు. ఆ తెగులు ఆశించకుండా రైతులు వెంటనే 0.2 గ్రాములు ప్లాంటామైసిన్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని చెప్పారు. అలాగే కాండం కుళ్లు రావడానికి కూడా అవకాశం ఉన్నందున దాని నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున కార్బండజిమ్+మాంకోజెబ్ శిలీంద్ర నాశక మందును (సాఫ్)లేదా ఒక మిల్లీలీటరు వాలిడామైసిన్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. అగ్గి తెగులును గమనించి ఒక లీటరు నీటికి 0.6 గ్రాముల చొప్పున ట్రై సైక్లోజోల్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు గనుక ఆశించి ఉంటే నత్రజని మోతాదు మించిందని తెలుసుకుని మళ్లీ నత్రజనని వేసుకోవడాన్ని వాయిదా వేసుకోవాలి.

పత్తిలో..

పత్తిపంటలోని నేలలో పున్న అధిక తేమను తగ్గించడానికి ఎకరాకు 25 కిలోల యూరియా, 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అనే రసాయనిక ఎరువులను పైపాటుగా పంటకు మొక్కల మొదళ్లలో 7–10 సెం. మీ దూరంలో పాదులు తీసి వేసి మట్టితో కప్పాలని చెప్పారు. ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 లేదా 13–0–45 లేదా 10 గ్రా యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. పిండినల్లి రావడానికి అవకాశం ఎక్కువగా ఉన్నందున, ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా రెండు మిల్లీ లీటర్ల ఫిప్రోనిల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

☛ నేల ద్వారా వ్యాప్తి చెందే ఎండు తెగులు నివారించుటకు 3 గ్రా. కాపర్‌ఆక్సిక్లోరైడ్ లేదా ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు నివారణకు 2. 5 గ్రా కార్బండజిమ్ + మాంకోజెబ్ (సాఫ్) అనే శిలీంద్ర నాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్టు వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని కోరారు.

మొక్కజొన్న పంటలో..

మొక్కజొన్నలో అధిక వర్షాల వలన నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఊదారంగులోకి మారే అవకాశం ఉన్నందున. ప్రస్తుతం పంట మోకాలు ఎత్తు నుంచి జల్లు కట్టే దశ వరకు ఉంది. కావున వర్షాలు ఆగిన తర్వాత మోకాలు ఎత్తు దశలో ఉన్నా పంటకు 5 గ్రా. 19–19–19 లేదా 20 గ్రా డీఏపీ మందును లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత వర్షాధార పంటకు పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను వేసుకోవాలని చెప్పారు.

☛ బ్యాక్టీరియా కాండంకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉన్నందున దాని నివారణకు బ్లీచింగ్ పౌడర్‌ను 5 కిలోలు వేసుకోవాలి. కత్తెర పురుగును కూడా గమనించుకుంటూ అవసరమైతే 0.3 మిల్లీ లీటర్ల క్లోరాంట్రినిప్రోల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని కోరారు. ఈ సూచనలు రైతులు పాటించాలని చెప్పారు.